క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామపంచాయతీ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో గురువారం దాతలు అన్నదానం చేశారు. గరిడేపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన పిన్నపురెడ్డి సుధాకర్‌రెడ్డి -జ్యోతిల కుమార్తె వినిలాక్షిత జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపు మరమ్మతులు పూర్తి



మరమ్మతులు చేసిన చేతిపంపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిబాబు

సాక్షి ఎఫెక్ట్..

చిలుకూరు : మండల కేంద్రం పరిధిలోని బేతవోలు రోడ్డులో నిరుపయోగంగా ఉన్న చేతిపంపుపై బుధవారం సాక్షిలో వచ్చిన కథనానికి గ్రామపంచాయితీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించారు. సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించడంతో గ్రామస్తులు సాక్షికి అభినందనలు తెలిపారు. అలాగే చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో పైపులైన్ మరమ్మతులు కూడా పూర్తి చేశారు.

నాగమ్మ మృతి బాధాకరం

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు గుండెపురి నాగమ్మ మృతి బాధాకరమని బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య అన్నారు. గురువారం నాగమ్మ దశదిన కర్మలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూల మాల నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నాగమ్మ కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు చేసిందని, ఆమె కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొలిశెట్టి వెంకయ్య, కోల వెంకన్న, వల్లోజు శ్రీను, యాదగిరి, నాగమ్మ కుటుంబ సభ్యులు గుండెపురి రాజ్‌కుమార్, వెంకన్న, బంధువులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి కృత్రిమ కాలు అందజేత



సైదులుకు కృత్రిమ కాలు అందజేస్తున్న పోరెడ్డి స్వరాజ్యలక్ష్మి

నేరేడుచర్ల : మున్సిపాలిటీకి చెందిన వేపచేదుల సైదులుకు అనారోగ్య కారణాలతో ఇటీవల ఎడమకాలును తొలగించారు. దీంతో దాత పోరెడ్డి స్వరాజ్యలక్ష్మి తన భర్త పోరెడ్డి సత్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థంగా రూ.2లక్షల విలువ గల కృత్రిమ కాలును గురువారం అందజేశారు. తనకు కృత్రిమ కాలును అందజేసిన స్వరాజ్యలక్ష్మికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నూకల సందీప్‌రెడ్డి, ఇంజమూరి శ్రీకాంత్, ఇంజమూరి పున్నయ్య, గోపి తదితరులున్నారు.

పారిశుద్ధ్య వారోత్సవాలు



వేపలసింగారంలో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న కార్యదర్శి గిరిజాకుమారి

హుజూర్‌నగర్‌రూరల్ : పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని వేపలసింగారంలో గురువారం ఆయా వీధుల్లోని డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తను పంచాయతీ కార్యదర్శి గిరిజాకుమారి ఆధ్వర్యంలో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో ఉన్న చెత్తను గ్రామపంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త కుండీలలో మాత్రమే వేయాలని సూచించారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది ఉన్నారు.

'మల్లన్నకు ఓటమి తప్పదు'

సూర్యాపేటటౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో తీన్మార్ మల్లన్నకు ఓటమి ఖాయమని ఓయూ విద్యార్థి జేఏసీ నేత, తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ గురువారం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అతడి నోరెందుకో మూగబోయిందని, జీఓ-46 బాధితులను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుంటే ప్రశ్నించడకుండా ఉండటం ఏమిటని పేర్కొన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్లన్నను కచ్చితంగా ఓడించి తీరుతామని తెలిపారు.

దొరకని గ్రాసం.. పోషణ భారం

- వర్షాభావంతో పశువులు, జీవాలకు దొరకని మేత
- పొద్దంతా తిరిగినా ఖాళీ డొక్కలతో తిరిగివస్తున్న మూగజీవాలు
- పశుపోషణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- ప్రభుత్వమే పశుగ్రాసం అందించాలని వేడుకోలు



మేతకు వెళ్తున్న పశువులు

మేళ్లచెరువు : పశుపోషణే ప్రధాన జీవనాధారంగా జీవిస్తున్న పాడిరైతులు వర్షాభావ పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాభావంతో చెరువులు ఎండిపోవడం, పొలాల్లో గడ్డి మొలవక మూగజీవాలు ఆకలితో అల్లాడుతున్నాయి. రైతుల ఇంటి నుంచి వెళ్లిన పశువులు సాయంత్రం కూడా ఖాళీ డొక్కలతోనే తిరిగి వస్తున్నాయి. దీంతో పశుపోషణ రైతులకు భారంగా మారుతుంది. మండలంలోని పలు గ్రామాల్లో పలువురు రైతులు పశుపోషణ పైనే ఆధారపడి ఉన్నారు. మండలంలో ఆవులు, గేదెలు 23,936, గొర్రెలు 50,596, మేకలు 7,671 ఉన్నాయి. వర్షాభావానికి తోడు వ్యవసాయంలో యాంత్రీకరణతో గడ్డి కొరత ఏర్పడింది. గడ్డి, నీరు లేక మూగజీవాలు అల్లాడుతుంటే రైతులు ఏమిచేయాలో తోచని పరిస్థితుల్లో ఉన్నారు.

పశుగ్రాసం ధరకు రెక్కలు..

వరికోత సమయంలో కూలీల కొరత కారణంగా యంత్రాల వినియోగం పెరిగింది. తద్వారా పశుగ్రాసం కరువు అవుతుంది. పశువులు ఉన్న యాజమానులు పశుగ్రాసం కొనుగోలు చేయాలంటే ధరల భయానికి జంకుతున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ ట్రక్కు గడ్డి ధర రూ.15వేల పైచిలుకు ఉంది. పంటలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రైతులు పశుగ్రాసం కొనుగోలు చేయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాభావంతో చెరువులు, కుంటల్లో నీరులేక పశువులకు ఇళ్ల వద్దనే నీటిని అందిస్తున్నారు. అధికారులు పశువులకు పశుగ్రాసంతో పాటు దాణాను ఉచితంగా అందించాలని రైతులు కోరుతున్నారు.

నీటితొట్లు నిరుపయోగం..

పశువులను పొలాలకు తీసుకొని వెళ్లినప్పుడు నీరు దొరక్క కిలోమీటర్ల కొద్ది వెళ్లి ఎన్నో ప్రయాసలకోర్చివాటికి నీరు అందించాల్సివస్తుంది. ఒక్కోసారి మురుగునీరు తాగి జీవాలు రోగాల బారిన పడుతున్నాయి. పశువుల దాహార్తిని దృష్టిలో ఉంచుకొని అధికారులు గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్లను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం పశుగ్రాసం అందించాలి



మూగజీవాలకు రోజురోజుకు పశుగ్రాసం కొరత తీవ్రం అవుతుంది. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. నిల్వ ఉన్న వరిగడ్డి పశువులకు రెండు నెలలుగా వేస్తున్నాం. ఎండల తీవ్రతకు మొలిచిన గడ్డి కూడా ఎండిపోతుంది. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వమే పశుగ్రాసం అందించేలా చర్యలు చేపట్టాలి.

– పెరుగు విజయ్, మేళ్లచెరువు

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్

కోదాడ : కోదాడ పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జూన్ 8న నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్యాంసుందర్ కోరారు. గురువారం కోర్టు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీమార్గమే రాజమార్గమని, కోర్టుల చుట్టూ తిరుగుతూ కక్షిదారులు తమ విలువైన సమయాన్ని దుర్వినియోగం చేసుకోవద్దన్నారు. ఆవేశంతో చేసే చిన్నచిన్న పొరపాట్ల వలన కుటుంబ సభ్యులు ఇబ్బందిపడతారని, రాజీ చేసుకోవడానికి ముందుకు రావాలని ఆయన కోరారు. సమావేశంలో సత్యనారాయణ, పి.పి. బొబ్బా కోటిరెడ్డి, న్యాయవాదులు గట్ల కోటేశ్వరరావు, మంద వెంకటేశ్వర్లు, హేమలత, దొడ్డ శ్రీధర్, నాగుల్‌పాష, రంగారావు, సిలివేరు వెంకటేశ్వర్లు, ఉయ్యాల నర్సయ్య, రంజాన్‌పాష, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కొట్టె పద్మ

మేళ్లచెరువు : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ కొట్టె పద్మసైదేశ్వరరావు కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కొట్టె పద్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సభ్యులు గ్రామాల్లో ఉన్న విద్యుత్, తాగునీరు, ఆరోగ్యం, రోడ్లు వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు ప్రజా సమస్యలపై స్పందించి చొరవ చూపాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ అజహర్‌అలీ, జెడ్పీటీసీ పద్మ, వైస్ ఎంపీపీ గాయం గోపిరెడ్డి, ఎస్‌ఐ పరమేష్, ఏపీఎం శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్‌గౌడ్, ఏపీఓ శైలజ, ఎంఈఓ సైదానాయక్, పశువైద్యాధికారి ఉషారాణి, మండల వైద్యాధికారి వేణుగోపాల్, ఆర్‌ఐ వాసు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం



పందిరి నాగిరెడ్డిని సన్మానిస్తున్న ఆస్క సభ్యులు

కోదాడ : పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించడం, వారికి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వడం అభినందనీయమని ఎంఎస్ విద్యాసంస్థల చైర్మన్ పందిరి నాగిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో అంబేద్కర్ ఆశయ సాధన కేంద్రం (ఆస్క) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆస్క అందిస్తున్న సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 12సంవత్సరాలుగా ఆస్క సంస్థకు వసతిని ఏర్పాటు చేస్తున్న పందిరి నాగిరెడ్డిని నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఎస్ విద్యాసంస్థల సీఈఓ ఎస్ఎస్.రావు, బల్గూరి స్నేహ, మాతంగి ప్రభాకర్‌రావు, యలమర్తి శౌరి, నందిపాటి సైదులు, గంధం బుచ్చారావు, వెంకటరత్నం, రాజు, కిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మారోజు వీరన్నకు నివాళి



మారోజు వీరన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నేరేడుచర్ల : మండల కేంద్రంలో మావోయిస్ట్ నేత మారోజు వీరన్న 25వ వర్ధంతిని గురువారం సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, వాస పల్లయ్య, రేణుక, అఖిల్‌కుమార్, హుస్సేన్, కరుణాకర్, లక్ష్మి, పావని, శ్యామల, సత్తెమ్మ, నాగమ్మ, సుమలత, ఫాతిమా, రజాక్, రంగయ్య, దుర్గమ్మ తదితరులున్నారు.

బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదు



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

హుజూర్‌నగర్ : దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం వివిధ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రైవేట్ రంగ ప్రోత్సాహంతో దేశంలో 5కోట్ల ఉద్యోగాలు పోయాయని, యువతకు ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి, పోకల వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, నంద్యాల రామిరెడ్డి, కొట్టు బాబు ఉన్నారు.

సూర్యనారాయణకు పరామర్శ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతోసీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్ గురువారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, హుజూర్‌నగర్ పట్టణ అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, మల్లేశ్వరి, వెంకటేశ్వర్లు, రామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

రైస్‌మిల్లు పనులు నిలిపివేయాలని వినతి



ఎంపీడీఓకు వినతిప్రత్రం అందజేస్తున్న గ్రామస్తులు

చిలుకూరు : పాత చిలుకూరులో ఇళ్ల మధ్య నిర్మాణం చేస్తున్న రైస్‌మిల్లు పనులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ చుట్టు పక్కల కాలనీవాసులు పలువురు గురువారం తహసీల్దార్ ధృవ కుమార్, ఎంపీడీఓ గిరిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. గతంలో ఇళ్ల మధ్యలో రైస్‌మిల్లు ఏర్పాటు చేయడంతో దుమ్ము, దూళి, పొగ, పొట్టుతో తమకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఈ విషయంపై విచారణ చేసి నూతన రైస్‌మిల్లు నిర్మాణ పనులకు అనుమతి ఇవ్వవద్దని కోరారు. ఈ విషయంపై కలెక్టర్, ఆర్డీఓ, ఎంపీడీఓకు, గ్రామపంచాయతీకు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలెబోయిన వెంకటి, యరగాని సైదులు, యరగాని నాగయ్య, మేకపోతుల శ్రీను, పవన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ డెంగీ నివారణ దినోత్సవ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది

చిలుకూరు : మండల కేంద్రంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది బస్టాండ్ సెంటర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలువురు డాక్టర్లు మాట్లాడారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కీటకాల పట్ల జాగ్రత్తగా ఉంటు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సుశీల, ప్రియాంక, సూపర్‌వైజర్ సావిత్రి, సీహెచ్ఓ వినోద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, సుదర్శన్, ఏఎస్ఎంలు, ఆశవర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీ పాల్గొన్నారు.

కేసు నమోదు

మేళ్లచెరువు : భూ తగాదా విషయంలో ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం గ్రామానికి చెందిన గజ్జెల వెంకటరెడ్డి అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై మండల కేంద్రానికి చెందిన గజ్జెల శంకరరెడ్డి స్థానిక తహసీల్దార్ కార్యాలయంవద్ద భూమి పంచాయతీ విషయంలో దూషించి కాలితో తన్నాడు. దీంతో బాధితుడు వెంకట్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ.పరమేష్ తెలిపారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్యయాదవ్

కోదాడ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, పార్టీ పరిశీలకుడు కటికం సత్తయ్యగౌడ్ కోరారు. గురువారం పట్టణంలో నిర్వహించిన ఆ పార్టీ నాయకుల, కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను పట్టభద్రులకు వివరించాలని కోరారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు చెత్త, డ్రెయినేజీల్లో పూడిక తొలగింపు



జాన్‌పహాడ్‌లో చెత్తను తొలగిస్తున్న కార్మికులు, పరిశీలిస్తున్న అధికారులు



గుడుగుంట్లపాలెంలో డ్రెయినేజీలో పూడికను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

పాలకవీడు : మండలంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంపై బుధవారం సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎట్టకేలకు మండలంలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీఓ దయాకర్, కార్యదర్శుల పర్యవేక్షణలో జాన్‌పహాడ్, కొత్తతండా, గుడుగుంట్లపాలెం గ్రామాల్లో పరిసరాల్లో చెత్తాచెదారం, డ్రెయినేజీలో పూడిక తొగింపు పనులు చేయించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలని కార్యదర్శులను ఆదేశించారు.

అంతర పంటగా పెసర సాగు



సిరిపురంలో మామిడిలో అంతర పంటగా సాగు చేసిన పెసరపంట

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన రైతు తన వ్యవసాయ క్షేత్రంలో ప్రస్తుతమండు వేసవిలో కూడా 10కుంటల భూమిలో పెసర సాగు చేపట్టారు. ప్రస్తుత వేసవిలో ఓ వైపు ఎండలు మండుతుంటే, మరో వైపు ఆయనకున్న నీటి సౌలభ్యాన్ని బట్టి భిన్నంగా మామిడిలో అంతర పంటగా పెసర సాగు చేపట్టారు. పెసర 60రోజుల పంట కావడంతో 10కుంటల భూమిలో 50కిలోల పంట పండిందని, ఎలాంటి రసాయన ఎరువులు ఉపయోగించకుండా సాగు చేపట్టానని ఆదర్శ రైతు శేషుకుమార్ తెలిపారు. పండిన పంటను వచ్చే ఖరీఫ్ సీజన్‌కు గాను విత్తనం కోసం విక్రయించనున్నట్లు ఆయన తెలిపారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి



అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న నాయకులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : రాజ్యాంగ రచయిత బీఆర్ అంబేద్కర్ ఆశయాలను యువత కొనసాగించాలని ఇరిగేషన్ ఏఏఈ బి.దుర్గయ్య అన్నారు. గురువారం చింతలపాలెం మండలంలోని రేబల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంబేద్కర్ దేశానికి అతిపెద్ద రాజ్యాంగాన్ని అందించి అన్ని వర్గాల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ కలిసి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాతంగి ప్రభాకర్, స్టాలిన్, బుచ్చారావు, నరసింహారావు, అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌లో చోరీ.. నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ రామాంజనేయులు

మఠంపల్లి: మండల కేంద్రంలోని ఓ రెస్టారెంట్‌లో రూ.2లక్షలు చోరీ చేసిన దొంగను పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండల కేంద్రంలో దేశబోయిన సంధ్య, శివ దంపతులు సన్స్ రెస్టారెంట్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 9వ తేదీన రాత్రి వారు రెస్టారెంట్ మూసివెళ్లగా.. మట్టపల్లికి చెందిన రామావత్ సైదులు అర్ధరాత్రి రెస్టారెంట్ తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.2లక్షలు దొంగిలించాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా గురువారం మట్టపల్లి వైజంక్షన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. సైదులు పట్టుబడ్డాడు. సైదులుపై హైదరాబాద్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో 22 కేసులు నమోదవ్వడంతో పాటు మూడేళ్ల జైలు జీవితం గడిపినట్లు ఎస్‌ఐ తెలిపారు. 7నెలల క్రితం జైలు నుంచి విడుదలై మట్టపల్లికి వచ్చి స్థానికంగా నివాసముంటూ మళ్లీ దొంగతనాలు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పేదల గుడిసెలను తొలగించడం అన్యాయం



అధికారులు తొలగించిన గుడిసెలు

సూర్యాపేట : ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు తొలగించడం అన్యాయమని బాధితులు వాపోయారు. గురువారం సంబంధిత బాధితులు విలేకరులతో మాట్లాడారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 20వ వార్డు జమ్మిగడ్డ పుల్లారెడ్డి చెరువు శిఖం భూమిలో గత కొన్నేళ్లుగా ఇళ్ల కోసం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి గత ప్రభుత్వం పట్టించుకోలేదని వారు ఆరోపించారు. ఊరికి వెళ్లింది చూసి అధికారులు గుడిసెలను తొలగించారని పేర్కొన్నారు. కూలీనాలి చేసుకొని బతుకులు గడుపుతున్న బైండ్ల కులస్తులు వేల డబ్బులతో పుల్లారెడ్డి చెరువు శిఖం భూమిలో నిర్మించుకున్న గుడిసెలను చెప్పకుండా నేలమట్టం చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డిని కలిసి తమ సమస్యను తెలిపినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేదలు వేసుకునే గుడిసెలకు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం కల్పించాలి

హుజూర్‌నగర్ : ప్రైవేట్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యం కల్పించాలని ఆ సంఘం నాయకులు నాగరాజు అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యల్లో ముఖ్యమైనది నిరుద్యోగ సమస్య అని అన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు ప్రతి డీఎస్సీలో ప్రత్యేకంగా కొని పోస్టులను కేటాయించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు

- నృసింహుడి కల్యాణానికి భారీగా తరలిరానున్న తెలుగు రాష్ట్రాల భక్తులు
- 18నుంచి 26వరకు సాగనున్న ఉత్సవాలు
- 22అర్ధరాత్రి నుంచి 23 తెల్లవారుజాము వరకు తిరుకల్యాణం



ఆలయాన్ని ముస్తాబు చేసిన నిర్వాహకులు



గర్భాలయంలోని మూలవిరాట్

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి వద్ద పవిత్ర కృష్ణానది తీరాన వెలసిన పంచనృసింహ క్షేత్రాలలో ప్రముఖంగా బాసిల్లుతున్న మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని నిర్వాహకులు ముస్తాబు చేశారు. ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని భక్తులతో పాటు చెన్నై, బెంగుళూరు తదితర నగరాల నుంచి వేలాది భక్తులు తరలిరానున్నారు. ఈనెల 18న అధ్యయనోత్సవాలతో ప్రారంభమై, 26న శృంగార డోలోత్సవం, పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈనెల 18నుంచి 21వరకు తొలక్కం, అధ్యయనోత్సవం, పరమపద ఉత్సవం, శాత్తుమర్రై పూర్తిగావించి అదేరోజు రాత్రి ఉత్సవాలను ప్రారంభిస్తారు. 21న విశ్వక్సేనారాధన, అఖండ దీపారాధన, అంకురార్పణ, ధ్వజారోహణం, 22న లక్ష మల్లికా సహస్రనామార్చన, లక్షమల్లికా పుష్పపూజ, అర్ధరాత్రి ఎదుర్కోళ్లు ఉత్సవంతో శ్రీస్వామి అమ్మవార్లను అశ్వ, గజ, సింహ, గరుడ, తదితర వాహనాలపై కల్యాణ మండపానికి చేర్చుతారు. 23న తెల్లవారుజాము వరకు శ్రీస్వామివారి కల్యాణం శోభాయమానంగా నిర్వహించనున్నారు. 23న గరుడవాహనసేవ, శ్రీస్వామివారి రథోత్సవం, హరికథలు, బుర్రకథలు, 24న సాయంత్రం శ్రీస్వామివారిని కృష్ణానదిలో హంసవాహనంపై విహరించనున్నారు. 25న చక్రతీర్థం, వసంతసేవ, దోపు ఉత్సవం, 26న శృంగార డోలోత్సవం, పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాలకు వచ్చే భక్తులకు సుమారు 22కులాల అన్నదాన సత్రాలతో పాటు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులకు చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పాలకవర్గం తెలిపింది. ఆర్టీసీ ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి అదనపు బస్‌సర్వీసులు నడపనున్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం



మట్టపల్లి దేవాలయంలో జరగనున్న శ్రీస్వామివారి బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, రంగులతో అందంగా ముస్తాబు చేశాం. అదే విధంగా ఆలయం వద్ద, కృష్ణానదిలో స్నానాలు ఆచరించడానికి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాము. వివిధ కులాల అన్నదాన సత్రాలు భక్తులకు భోజన వసతులు కల్పించుతున్నారు.

– చెన్నూరు మట్టపల్లిరావు, అనువంశిక చైర్మన్, మట్టపల్లి దేవాలయం